క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మహదేవ్

సూర్యాపేటటౌన్ : గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా కేంద్రంలోని శ్రీమారుతి విద్యానికేతన్ విద్యార్థి జె.లోకేష్‌ను సోమవారం పాఠశాలలో పాఠశాల చైర్మన్ మీలా మహదేవ్ అభినందించారు. అలాగే సూర్యాపేటలో నిర్వహించిన గురుకుల్ ఒలింపిక్స్‌లో వివిధ విభాగాల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనంతుల కృపాకర్, కక్కిరేణి చంద్రశేఖర్, పాఠశాల ఇన్‌చార్జ్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు మోక్షం

సూర్యాపేట : ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. మార్చి 31 నాటికి పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయాలని సోమవారం మున్సిపాలిటీ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

34వేల దరఖాస్తులు..

సూర్యాపేట పట్టణంలోని 48 వార్డుల పరిధిలో సుమారు 34వేల దరఖాస్తులు ఉన్నాయి. దరఖాస్తుదారులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఎల్ఆర్ఎస్ కోసం 33వేల మంది రూ.వెయ్యి చెల్లించారు. మరో 1000మంది రూ. 10వేలు చెల్లించారు. వీటన్నింటిని మార్చి 31నాటికి క్లియర్ చేయనున్నారు. ఈ దరఖాస్తులతో పేట మున్సిపాలిటీకి రూ. 20కోట్ల ఆదాయం చేకూరనుంది.

భక్తులకు అన్నదానం



ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం రాత్రి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, న్యాయవాది పర్రెపాటి యుగంధర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్ గౌడ్, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు ఒక్కొక్కటిగా అమలు

అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నిద్ర సంపత్‌నాయుడు చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ త్వరలో అమలవుతాయని తెలిపారు. రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం ప్రభుత్వం రూ.80 కోట్ల బడ్జెట్ కేటాయించిందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన అన్ని పథకాలు అమలై తీరుతాయన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కంటి వైద్యశిబిరం

తుంగతుర్తి : మండల కేంద్రంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మే-డివిజన్ ఆస్పత్రి స హకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 51 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పాలవరపు సంతోష్, మల్లయ్య, ఓరుగంటి సత్యనారాయణ, పుల్లయ్య, ఓరుగంటి అంతయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించనున్న ముత్యాలమ్మ ఆలయం కోసం డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానంద చారి సోమవారం ఆలయ నిర్వాహకులకు రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూరారపు సైదులు, సూరారపు వెంకటాద్రి, శ్రీను, సతీష్, సురేష్, కిరణ్, మధు, వెంకన్న, బుచ్చిరాములు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్వాహకులతో యోగానందచారి

పల్లెలకు నిధులు.. జోరుగా పనులు

- తుంగతుర్తి నియోజకవర్గానికి రూ.10.50 కోట్లు మంజూరు
- గ్రామాల్లో కొనసాగుతున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం

అర్వపల్లి : చిన్నపాటి వర్షం పడినా గ్రామాల్లో వీధులు చిత్తడిగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ వీధుల్లో మురుగునీరు చేరి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడం కోసం ప్రభుత్వం సీసీ(సిమెంట్ కాంక్రీట్) రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోంది. తుంగతుర్తి నియోజకవర్గానికి సంబంధించి ఇటీవలే నిధులు మంజూరయ్యాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పనులు చేపడుతున్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా తుంగతుర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రూ.10.50 కోట్లు మంజూరయ్యాయి.

మండలాల వారీగా నిధుల కేటాయింపు ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలోని 17 గ్రామపంచాయతీలకు రూ.1.70 కోట్లు, తుంగతుర్తి మండలంలోని 24 పంచాయతీలకు రూ.1.90 కోట్లు, మద్దిరాల మండలంలోని 14 పంచాయతీలకు 1.40 కోట్లు, నూతనకల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు రూ. 1.80 కోట్లు, నాగారం మండలంలోని 14 గ్రామపంచాయతీలకు 1.70 కోట్లు, తిరుమలగిరి మండలంలోని 18 గ్రామపంచాయతీలకు రూ. 1.80 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. ఈ ఆరు మండలాల్లో 86 పనులు చేపట్టనున్నారు. ఇందులో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపడతారు. కాగా ఇప్పటికే నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ప్రస్తుతం సర్పంచ్‌లు లేకపోవడంతో గ్రామ ప్రత్యేక అధికారులే నిర్మాణ పనులను చేయిస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంది. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బొల్లంపల్లిలో కొత్తగా నిర్మించిన సీసీరోడ్డు



అన్నారంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొంత ఇబ్బంది తీరింది



"మా గ్రామానికి ఎమ్మెల్యే సామేలు సీసీరోడ్ల నిర్మాణానికి రూ. 10లక్షలు మంజూరు చేయగా పనులు పూర్తి కావొస్తున్నాయి. ఈ రోడ్ల నిర్మాణంతో వీధుల్లో బురద సమస్య కొంత తీరింది. అలాగే గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కూడా వెంటనే చేపట్టాలి.

– కేసాని రాహుల్, బొల్లంపల్లి

పనులు జరుగుతున్నాయి



"నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 10.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపడుతున్నాం. గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మార్చి నెలాఖరు వరకు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– గుర్రం కొండయ్య, నాగారం సబ్ డివిజన్ డీఈఈ

మార్చి 1న సూర్యాపేటకు 'విజయ సంకల్ప యాత్ర'

దురాజ్‌పల్లి : భారతీయ జనతా పార్టీ బస్సు యాత్ర మార్చి 1న సూర్యాపేట నియోజకవర్గానికి చేరుకుంటుందని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్రకు ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. దేశంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టడమే లక్ష్యంగా విజయ సంకల్ప బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్యనే పోటీ ఉంటుందని.. బీఆర్ఎస్‌కు వేసే ఓటు వృథా అవుతుందన్నారు. గత పది సంవత్సరాలుగా ప్రధాని మోదీ పరిపాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

కొనసాగుతున్న శ్రీలక్ష్మి తిరుపతమ్మగోపయ్య జాతర



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : చీదెళ్ల గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వాముల జాతర సోమవారం మూడో రోజు కొనసాగింది. మండల పరిధిలోని తంగెళ్లగూడెం గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాలతో వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు ప్రభబండ్లతో ఊరేగింపుగా దేవాలయం వద్దకు చేరుకున్నారు. స్వామిఅమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవాలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డిలు తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. నెల్లూరు వారిచే డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఆట పాట కార్యక్రమం నిర్వహించగా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, ఎడ్ల వెంకట్‌రెడ్డి, జూలకంటి రాజశేఖర్‌రెడ్డి, చింత రాంబాబు, కీర్తి వెంకట్రావు, జాల సైదులు, అనంతుల ఆంజనేయులు, సొంటి శ్రీను, గొట్టిపర్తి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సూర్యాపేట జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఎంజీరోడ్డులో హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దైద అనిత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం- 2024 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్, ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి పుట్టల మల్లేష్, హోప్ సంస్థ ఆర్గనైజర్స్ జాటోత్ చిలకమ్మ, దొంతగాని కరుణాకర్, కాసా అనసూర్య, వెంపటి గురూజీ, లచ్చు నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



తుంగతుర్తిలో వ్యవసాయ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



తిరుమలగిరిలో జెండావిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తుంగతుర్తి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండల కేంద్రంలో రూ.72లక్షల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసిందని, త్వరలో మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలుస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఘోర పరాభవం తప్పదని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్‌ను బొంద పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ప్రజా బలం కలిగిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే దమ్ము బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ సంపదను దోచుకొని ప్రజలను, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలను లక్ష మెజార్టీతో గెల్చుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ నియామకంలో సామాజిక న్యాయం పాటించామని తెలిపారు. తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తీగల గిరిధర్‌రెడ్డిని, తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పాలకుర్తి రామతానురాజయ్యను, శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శంకర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగాలను భర్తీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ జిల్లా అధికారి కేఎస్ శర్మ, డీఈఈ కర్లాకర్‌రెడ్డి, ఏఈఈ అశోక్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి సురేష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, రేతినేని శ్రీనివాస్, మద్ది కృష్ణమూర్తి, రాంబాబు, వెంకన్న పాల్గొన్నారు.

రూ.2లక్షల ఆర్థికసాయం

శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన పుల్లూరి దేవేందర్ కూతురి పెళ్లికి సోమవారం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.2లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నూతనకల్ : గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం యడవెల్లిలో రూ. 10లక్షల వ్యయంతో నిర్మించే సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని మౌలిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, తిరుమలప్రగడ అనురాధ, తీగల గిరిధర్‌రెడ్డి, పసుల వెంకన్న, గుర్రం సత్యనారాయణగౌడ్, లింగాల రామచంద్రు, పసుల అశోక్‌యాదవ్, జనార్దన్, లింగాల వెంకటయ్య, పసుల రవి, లింగాల రాములు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : యడవెల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

తిరుమలగిరి : భవిష్యత్‌లో జరిగే పంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులదే విజయమని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. సోమవారం మొండిచింత తండాలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని వందశాతం అమలు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని తండాలకు బీటీరోడ్డు సౌకర్యం కల్పిస్తానని అన్నారు. పార్టీ కార్యకర్తలందరికీ అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్, పాలకుర్తి రాజయ్య, రాముగౌడ్, రాపాక సోమేష్ పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తాం

తుంగతుర్తి : వ్యవసాయ రంగానికి కరెంట్ కోతలు లేకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి విద్యుత్ అధికారుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యుత్తు సరఫరాలో నిర్లక్ష్యం వహించినా, అవాంతరాలు సృష్టించినా విద్యుత్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో 15 నిమిషాల పాటు అవాంతరం జరిగినట్లయితే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత విద్యుత్ సిబ్బందిపై ఉందని తెలిపారు. గత ఏడాదికంటే ప్రస్తుతం జిల్లాలో 10శాతం మేర విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. వచ్చేనెల మార్చి 15 వరకు రోజుకు 15,450 మెగావాట్ల విద్యుత్తు అవసరం ఉందని, ప్రస్తుతం రోజుకు 20 వేల మెగావాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ఆయకట్టు ప్రాంతాలైన నాగార్జునసాగర్, శ్రీశైలంలో జలాలు ఎండిపోయాయని.. దీంతో కరెంటు ఉత్పత్తి 40 శాతం తగ్గిందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈఈలు శ్రీనివాస్‌రావు, రాములు నాయక్, ఆయా మండలాల ఏఈలు శ్రీనివాస్, మహేంద్ర కుమార్, ప్రణయ్, సురేందర్, వేణుగోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలో మాట్లాడుతున్న డీఈఈ శ్రీనివాస్

అర్వపల్లి : వ్యవసాయ, గృహ వినియోగదారులకు జాజిరెడ్డిగూడెం మండలంలో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వాస శ్రీకాంత్ తెలిపారు. సోమవారం ఆయన అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వినియోగదారులు వెంటనే 94408 13617 నంబర్‌కు తెలియజేయాలని చెప్పారు. రైతులు కూడా నిరంతర విద్యుత్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

వైభవంగా లక్ష్మీనర్సింహుడి గరుడోత్సవం



గరుడ వాహనంపై స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్ధరాత్రి స్వామి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం ముగిశాక స్వామివారు శ్రీదేవి, భూదేవితో కలిసి గరుడవాహనంపై కొలువుదీరారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి అమ్మవార్లకు ఆలయంలో పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, శేషాద్రిదీక్షితులు, ఆనంద్ దీక్షితులు, పవన్‌కుమార్, యాజ్ఞికుడు గుడిపుడి మాధవచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయోధ్యకు తరలిన భక్తులు

తుంగతుర్తి : మండల కేంద్రం నుంచి పలువురు భక్తులు సోమవారం అయోధ్యకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు తుంగతుర్తిలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యకు తరలిన వారిలో భక్తులు మల్లేపాక సాయిబాబు, గాజుల మహేందర్, విక్రం, వెంకన్న, అజయ్, అనిల్, నాగమల్లు తదితరులు ఉన్నారు.

నూతనకల్ : అయోధ్యలోని శ్రీరాముడి దర్శనం కోసం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 37 మంది భక్తులు సోమవారం తరలివెళ్లారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్, ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవ రెడ్డిలు అయోధ్యకు వెళ్తున్న భక్తులను కలిశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు

నడిగూడెం : మండల పరిధిలోని గ్రామాల్లో ఈ నెల 27 నుంచి మార్చి 2 వరకు సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు సోమవారం ప్రకటనలో తెలిపారు. 27న వల్లాపురం, సిరిపురం, నారాయణపురం, 28న కేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, 29న వేణుగోపాలపురం, బృందావనపురం, శ్రీరంగాపురం, మార్చి 1న రత్నవరం, తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్ పేట, 2న రామాపురం, చాకిరాల, నడిగూడెం గ్రామాల్లో సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

నడిగూడెం : వల్లాపురం రెవెన్యూ పరిధిలోని శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం జీవ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయానికి, యాగశాలకు మంగళ తోరణాలు కట్టారు. గోపూజ, గణపతిపూజ నిర్వహించారు. పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, శాలసంస్కారం, అఖండ దీపస్థాపన, బింబగ్రహణం, వాస్తుపూజ, వాస్తుహోమం, పరియజ్ఞకరణం, మత్స సంగ్రహణం, ఇత్యాది తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 28న ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

నూతనకల్ : దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ తండు రేణుకశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం నూతనకల్ మండల పరిధిలోని తాళ్ల సింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చల్లా తేజ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దోరెపల్లి అశోక్, జటంగి గణేష్, తండు సత్యనారాయణగౌడ్, చిత్తలూరి నారాయణ, జటంగి వెంకన్న, బుచ్చిబాబు, పన్నాల అశిరెడ్డి, జటంగి లింగస్వామి, రేణుకుంట్ల రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దాతలు

పలువురికి ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : కోడూరు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త గంట యల్లమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. దీంతో గ్రామానికి చెందిన ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు దేశగాని పాపయ్యగౌడ్ సోమవారం మృతురాలి కుటుంబీకులకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

మద్దిరాల : జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు లంజపెల్లి వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొబ్బిలి వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల వెంకటేశ్వర్లు సోమవారం మృతుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



నూతనకల్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు



తుంగతుర్తిలో నిరసన తెలుపుతున్న నాయకులు

నూతనకల్ : డబ్ల్యూటీఓ నుంచి భారత్ బయటకు రావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కందాల శంకర్‌రెడ్డి కోరారు. సోమవారం ఎస్‌కేఎం పిలుపులో భాగంగా మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డబ్ల్యూటీఓ సదస్సు ప్రారంభం కానున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా డేగా పాటిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కూసు సైదులు, సామ దామోదర్‌రెడ్డి, తొట్ల అచ్చయ్య, ఉప్పుల పరమేష్, బాణాల మధుసూదన్‌రెడ్డి, తొట్ల అన్వేష్, బాణాల విజయ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూటీఓ నుంచి భారత్ వైదొలగాలి

తుంగతుర్తి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ సోమవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య మాట్లాడారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ)నుంచి భారత్ వైదొలగాలని డిమాండ్ చేశారు. హర్యానా పోలీసుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన రైతు కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం అందించాలని అన్నారు. మతోన్మాద బీజేపీని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గొడ్డలి నర్సయ్య, కాసర్ల దుర్గయ్య, లాల్, చంద్రయ్య, భిక్షం, మల్లయ్య, రాములు, హరిచంద్రు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపు అంచుల్లో ప్రయాణం



జాజిరెడ్డిగూడెం పరిధిలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో కూలీలు ఆటోలు, ప్రైవేట్ వాహనాల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. గ్రామాలకు బస్సులు నడపాలని కోరుతున్నారు.